21

# నలువది దినములు

## (మత్తయి 28; మార్కు 16; లూకా 24; యోహాను 20,21; అపొ. 1:1-12)

**1. పునరుత్థానం.** – మెస్సీయా పునరుత్థానము ప్రవక్తలచే స్పష్టంగా ప్రవచింపబడింది (కీర్తన. 16:10; యెషయా 55:3ను; అపొ. 2:25–31; 13:34–37తో పోల్చి చూడు), మాటి మాటికి ప్రభువుచే ముందుగా సూచింపబడింది (మత్తయి 16:21; 17:9; 20:19; 26:31, 32). ఆయన శిష్యులు రాజకీయమైన రాజ్యమనే భావనలతో వారి మనస్సులు ఎంతగా నింపబడియున్నాయంటే, క్రీస్తు నిజంగా చనిపోతారనే విషయం వారు నిజంగా నమ్మలేక పోయారు గనుక ఆయన మరణం వారిని భ్రమింపజేసింది, స్పర్శజ్ఞానం లేకుండ చేసింది. సిలువలో ఆయన మరణించినప్పుడు నరులకు కన్పించినంత వరకు ప్రభువైన యేసు పని నిస్సహాయంగా పోయినంతగా ఎవరి పనియు నష్టపోలేదు. యోసేపు  సమాధిలో యేసు దేహం సమాధి చేయబడడంతో అపొస్తలుల నిరీక్షణలన్నీ సమాధి చేయబడ్డాయి. ప్రభువైన యేసు లేపబడక పోయినట్లయితే, వారి నిరీక్షణలు ఎన్నడూ ఉజ్జీవింప జేయబడేవి కావు. ఆయన మృతులలోనుండి లేపబడక పోయినట్లయితే, లోకం ఆయనను గూర్చి మరి ఎన్నడు వినగలిగియుండేది కాదు. జననము, వ్యక్తి, పునరుత్థానం – ఈ మూడు ప్రాముఖ్యమైనవి మరియు సృజనాత్మక అద్భుతాలైయున్నాయి. ఇవి క్రైస్తవ్యానికి ఏకైకమైనవియు, తగిన తాళపు చెవిగా ఉన్నాయి. సబ్బాతు గడిచిపోయింది – విచారంలో నిలిచియున్న శిష్యులకు అది యొక దుఃఖకరమైన సబ్బాతే. ఇంకా చీకటిగానే ఉన్న ఉదయాన భక్తిగల స్త్రీలు, “సిలువ వద్ద కడపటి వారైయున్నా, సమాధి వద్ద మొదటివారై యున్నారు” – యిద్దరు మరియలు, మిగిలినవారు. సమాధి చేయబడిన స్థలం మాత్రమే వారు చూచారుగాని, ముద్రను గూర్చిగాని, కావలిని గూర్చిగాని వారికేమి తెలియనట్టుంది. సిలువ వేయబడిన రాత్రి సమయంలేక చేయని పనిని సంపూర్తి చేయడానికి వారు సుగంధ ద్రవ్యాలతో వచ్చారు. అయితే సమాధి ఖాళీగా ఉంది! పేతురు యోహానులు సమీపంగా ఉన్నారు, త్వరలోనే వారు సమాధి వద్దకు వచ్చారు. వారందరి ఆలోచన మొదట్లో, దేహం దొంగిలింపబడిందని; అయితే ప్రత్యక్షమైన దేవదూతలు పునరుత్థానాన్ని గూర్చి బయలుపరచారు.

**2. ప్రభువైన యేసు యొక్క పది ప్రత్యక్షతలు.** – (1) మగ్దలేనే మరియకు. ఎప్పటి కంటెను ఎక్కువ కలవరపరచబడినవారై శిష్యులు వెళ్లిపోయారు. మరియయైతే సమాధి ప్రాంతంలోనే వేచి ఉంది. ఆనందంతో పరవసించిన ఆమె దృష్టికి అందరికంటె ముందుగా

ప్రభువు ప్రత్యక్షమై, తన శిష్యులకు యిచ్చే వర్తమానంతో ఆయన ఆమెను కలిసికొన్నారు. (2) కొంచెంసేపు తరువాత యితర స్త్రీలకు. శిష్యులను వెదుక వెళ్లిన స్త్రీలకు ప్రభువు ప్రత్యక్షమై, తన సహోదరులకు వారితో వర్తమానం పంపారు. (3) సీమోను పేతురుకు: స్వల్పంగా అది లూకా 24:33, 34లో ప్రస్తావించబడింది; పౌలుచే కూడా (1 కొరింథీ. 15:5). (4) ఎమ్మాయికి వెళ్లే మార్గంలో యిద్దరు శిష్యులకు. ఆ దినమున క్లేయోపాయు మరియొక శిష్యునితో కలిసి ఏడో పనిమీద సమీపమున ఉన్న ఎమ్మాయి అనే గ్రామానికి వెళ్లుతున్నారు. వారు ఖాళీ సమాధిని గూర్చియు, దేవదూతల ప్రత్యక్షతను గూర్చియు విన్నారు. వారు నడుచుచు జరిగిన సంగతులను గూర్చి మాట్లాడుకొంటూ ఉండగా, ప్రభువు వారిని కలిసికొని వారి విచారానికి కారణమేదో కనుగొని, తన్ను గూర్చిన ప్రవచనాలను తెరచి, కడకు భోజనానికి కూర్చున్నప్పుడు వారికి తన్ను తాను ప్రదర్శించుకున్నారు. ఆ సాయంకాలము యెరూషలేమునకు వచ్చి, సీమోను పేతురుకు ఆయన ప్రత్యక్షమైన సంగతిని గూర్చి తీక్షణంగా మాట్లాడుకొంటున్న అపొస్తలులను, మరి యితరులను వారు కనుగొన్నారు. ఇంతకు ముందుగానే మండుతున్న మంటకు వారి సొంత అనుభవం ఇంధనం తగిలించినట్లయింది. ఇంకను వారు నమ్మనొల్లని పరిస్థితిలోనే ఉన్నారు. (5) తోమా లేనప్పుడు అపొస్తలులకును తక్కినవారికిని. ఉద్రేక పూరితమైయున్న వారి మధ్య ప్రభువు తటాలున ప్రత్యక్షమై, “మీకు సమాధానము కలుగును గాక” (లూకా 24:36; యోహాను 20:19) అంటూ శుభ వచనం పలికారు – మరియు వారి అవిశ్వాసము నిమిత్తము ఆయన వారిని మందలించారు. తన పునరుత్థానము యొక్క నిజాన్ని, ఆయన వారికి ప్రత్యక్షమయ్యిన దానిని రుజువు చేయడానికి పొడవబడిన ఆయన చేతులను కాళ్లను చూపారు, పైగా వారి సముఖంలో ఆయన భోజనం చేశారు. ఈ ప్రత్యక్షతలన్నీ ప్రభువు లేచిన దినానే జరిగాయి (6) తోమాతో కూడా అపొస్తలులందరికి – గత ఆదివారం రాత్రి మీటింగులో తోమా హాజరు కాలేదు, మరియు యితరులిచ్చే సాక్ష్యాన్ని అతడు అంగీకరించలేదు. ఒక వారం తరువాత, వారందరు కలిసియున్నారు, ప్రభువు వారికి మరల ప్రత్యక్షమయ్యారు. తన సొంత జ్ఞానేంద్రియాల సాక్ష్యానికి తోమా లొంగిపోయాడు. మరియు (పౌలు తప్ప) తప్పిపోయిన అపొస్తలుడైన తోమా పునరుత్థానాన్ని బట్టి మారిన వాడయ్యాడు. (7) గలిలయ సముద్రము వద్ద ఏడుగురు శిష్యులకు. చేపలు పట్టే తమ గత వృత్తికి శిష్యులు తిరిగి వెళ్లారు. ఒక రాత్రి పూర్తిగా శ్రమపడినా ప్రయోజనం లేక పోగా, కుడివైపున తమ వలలు వేయవలసిందిగా ఒక వింతైన వ్యక్తిచే వారు నడిపింపబడ్డారు. ఆయన వారి బోధకుడని వచ్చిన ఫలితాలవలన యోహాను కనుగొన్నాడు; అయితే ఆయనకు వందనం చెప్పడానికి ఒడ్డునకు తొలిగా ఈదుకొంటూ వెళ్లినవాడు పేతురే. ఈ సందర్భంలోనే పేతురు తన్ను ప్రేమిస్తున్నట్టు ముమ్మారు ప్రమాణం చేయించుకున్నారు, ముమ్మారు అతడు ఆయనను ఎరుగనన్న దానిని రద్దు చేయడానికి అనేది నిస్సందేహం. (8) అయిదువందల మంది శిష్యులకు. ఇది గలిలయలో సంభవించి యుండవచ్చు (మత్తయి 28:16,19; 1 కొరింథీ. 15:6తో పోల్చి చూడు). శిష్యుల సమూహము అక్కడ వివరించారు. ఈ మీటింగు విషయమైన వివరాలు మనకు యివ్వబడలేదు. (9) యాకోబుకు (1 కొరింథీ. 15:7). (10) ఆరోహణ సమయంలో తన

అపొస్తలులకు ఒలీవకొండ మీద. ఆ నలభై దినాలలో రికార్డు చేయబడిన వాటికంటే ఎక్కువ మారులు ప్రభువు తన అపొస్తలులతో గడిపియుండవచ్చు. ముక్కలు ముక్కలుగా లభించే చరిత్రలో కేవలం ప్రత్యక్షమైన దానికంటే ఎక్కువగా వారికి బోధించడం ప్రాముఖ్యమైయుండవచ్చు (అపొ. 1:3 చూడు).

**3. కడపటి ఆదేశం. –** చివరిగా కలిసికున్నప్పుడుగాని, లేక ఆయన పునరుత్థానుడైన తరువాత ఆయా సమయాల్లో కలిసికున్నప్పుడుగాని ప్రభువైన యేసు తన అపొస్తలులకు కడసారి ఆజ్ఞను లేక ఆదేశాన్ని యిచ్చారు. యోహాను పనిగాని, వ్యక్తిగతంగా ప్రభువు జరిగించిన పనిగాని, మొదట పన్నిద్దరి ఆ తరువాత డెబ్బదిమంది పనిగాని సన్నాహ రూపకమైనవే. వారి సందేశము – "రాజ్యము సమీపమైయున్నదని" (మత్తయి 3:2; 4:17; 10:7; లూకా 10:9తో పోల్చి చూడు). యేసే క్రీస్తయి ఉన్నాడని ప్రకటించడానికి అపొస్తలులు అనుమతించబడలేదు (మత్తయి 16:20; 17:9). క్రీస్తు వచ్చి, జీవించి, బాధనొంది చనిపోయి తిరిగి లేపబడిన దానిలో ప్రకటింపబడే సువార్త ఉంది. ఒకటి తప్ప మిగిలిన పరిమితులన్నియు తొలగింపబడ్డాయి. "సిలువ వేయబడిన క్రీస్తును" అంటే సంపూర్ణ సువార్తను వారు చివరిగా ప్రకటింపవలసినవారై ఉన్నారు. (1 కొరింథీ. 15:1–4; 2:1); "సర్వసృష్టికి"; క్రీస్తునందు విశ్వాసము, పాపముల విషయమై మారుమనస్సు, తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి బాప్తిస్మం ప్రకటించుట ద్వారా "సమస్త జనులను శిష్యులుగా చేస్తూ," ఉన్నారు (మత్తయి 28:19). అయితే వారు యింకను సంపూర్ణంగా యోగ్యత పొందలేదు "మీరు పైనుండి శక్తి పొందు వరకు పట్టణములో నిలిచియుండుడి" (లూకా 24:49; అపొ. 1:4 కూడా చూడు). ఎందుకనగా "కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుదురు" (అపొ. 1:5). అలాటి సందేశంతో చివరి ఆదేశం యివ్వబడింది. దీనిక్రింద పదునెనిమిది క్రైస్తవ శతాబ్దాలు, ప్రపంచ వ్యాప్తమైన సువార్త పరిచర్య కొనసాగింది.

**4. ఆరోహణం. –** "నేను వెళ్లిపోవుటవలన మీకు ప్రయోజనకరము; నేను వెళ్లనియెడల ఆదరణకర్త మీ యొద్దకు రాడు; నేను వెళ్లిన యెడల ఆయనను మీ యొద్దకు పంపుదును" (యోహాను 16:7). అందువలన ప్రభువు తన శిష్యులను ఒలీవకొండ యొద్దకు నడిపించి, "చేతులెత్తి వారిని ఆశీర్వదించెను. వారిని ఆశీర్వదించుచుండగా ఆయన వారిలోనుండి ప్రత్యేకింపబడి పరలోకమునకు ఆరోహణుడాయెను" (లూకా 24:50–51). మెస్సీయా పనిమీద ఆయన ఆరోహణము క్రొత్త వెలుగును ప్రకాశింపజేసింది. శరీర సంబంధమైన వారి పాత కలలు నెమ్మదిగా తొలిగిపోనారంభించాయి. దేవుడు మానవుని పైకి లేపునట్లు ఆయన క్రిందికి వంగారు. గనుక ఆ పదునొకండుగురు ఆనందంతో యెరూషలేమునకు తిరిగి వచ్చారు. శిష్యులు వాగ్దానం చేయబడిన ఆత్మకొరకు కనిపెట్టుటతో సువార్తల చరిత్ర ముగింపబడుతుంది.